# ఏ... పెళ్ళెప్పుడు?

★

రచన: వి. లలితా ఉమామహేశ్వరి



"హమ్మయ్యా! పరీక్షలు అయిపోయాయి! ముందు కార్యక్రమం చెప్పండీ!" అంది సావిత్రి.

"రిజల్ట్సు రావాలిగదా!...అయినా నా యిష్టమేముందీ...మావాళ్ళు ఎలా చెప్తే అలాగే..." విజయ నవ్వింది. ఆ నవ్వుకి అర్థం తెలియనివాళ్ళేంకారు మిగతావాళ్ళు.

"ఒకటీ! ఈవిడ వ్యవహారం తేలిపోయినట్టే" నీసంగతేమిటన్నట్టు ప్రభావతివైపు చూచింది భారతి.

"నీవిషయం చెప్పవోయ్ మొదట!" సావిత్రి తిరిగి అడిగింది.

పార్కులో ఒకమూల, బత్తుగా పెరిగిన పచ్చిక మీద నలుగురు అమ్మాయిలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. బి.యస్.సి. పరీక్షలు రాశారు. ఆపూట్లో అలా పార్కులో కూర్చుని మాట్లాడుకోవడం ఆడపిల్లల విషయంలో అరుదే. సాధారణంగా ఆడవాళ్ళు పార్కులకి రారు అక్కడ. సరదాగా ఒక గంట సేపైనా గడుపుదాం అని ఆ నల్గురూవచ్చారు. ఎక్కడైనా గడపవచ్చు, కాని ఒక్కరోజుకి ఏమైపోతుందిలే అనుకున్నారు.

ఇందాకల తనడిగినదానికి జవాబు చెప్పమన్నట్టుగా సావిత్రి భారతివైపు చూస్తూంది.

"నేనైతే, పోస్ట్-గ్రాడ్యుయేటు చదవాలనుంది" అంది భారతి.

"నాకొక్కడ! ప్చ్! మరి మన రాత ఎలా వున్నాయో?" సావిత్రి నిరుత్సాహంగా వుంది.

ప్రక్కకి పడిపోతున్న గులాబీని తలలో సరిగ్గా సర్దుకుంటూంది విజయ. "అయితే అప్పుడే మనలో యిద్దరు పి.జి. లు అయిపోయినట్టే" అంది. వెంటనే అడిగింది మళ్ళా "నువ్వానా ప్రభా?"

"పి.జి. ల మాటామో, పీజియన్లమే అవుతామో!" ప్రభావతి చమత్కారానికి ఫక్కుమన్నారు ముగ్గురూ. ప్రభావతి ఎప్పుడూ హాస్యంగా మాట్లాడ్తుంది—నవ్విస్తుంది.

"నీ మాటలకి అర్థం ఏమిటో?"

"కాలం ఎప్పుడూ మనదిలేదు. పరిస్థితుల ప్రభావం మూలాన తలకొక మూలకీ ఎగిరిపోయే పావురాయిలమే అవుతే?"

"చాల చక్కగా చెప్తావ్ ప్రభా!" సావిత్రికి ప్రభావతన్నా, తన మాటలన్నా చాలచాల యిష్టం.

భారతి హాస్యం పట్టించింది.

"ప్రభావతి ఎంత గడుసుదో చూశారా! తొందరలోనే పెళ్ళి చేసుకుని జంట పావురాల మల్లే ఎగిరిపోదామని కాబోలు!"

"అబ్బ! నీ వూహ మరీ బాగుందోయ్!"

"సావిత్రీ! ఇలా పొగడడమే నీ పనా? కూహా గీహా అంటూ యిందాకట్నుంచీ చంపుతున్నావ్. ఇంతకూ తమరి ప్లానేమిటో సెలవిస్తారా?" ప్రభావతి సావిత్రి భుజంమీద తన ముఖాన్నుంచి మృదువుగా నొక్కింది.

ఆ చేష్టంటే పడిచస్తుంది సావిత్రి. ఇంకొక

విధంగా, ప్రభావతి తన అభిమానం, ప్రేమలని బహిర్గతంచేసే పద్ధతి అది. స్నేహితురాలి కళ్ళలోకి చూసి సావిత్రి తలవంచుకుంది.

"నాకు భవిష్యత్తుమీద పెద్దగా ఆలోచనలు రావు, కలలోగూడ వూహించను, మా యింటి పరిస్థితి అలాంటిది. ఈ పరీక్ష పాసవుతే—ఆలోచిస్తాను"

ప్రభావతి కళ్ళలో బాధ రెప్పపాటు కాలం కదలాడింది, వాళ్ళు నలుగురూ స్నేహితులే, అందులో సావిత్రీ, ప్రభావతీ మరీ దగ్గరయ్యారు, అందుకే ఒకరి గురించి ఒకరికి అంత ఆత్రుతా, బాధాను.

సావిత్రి తండ్రి ఆరోగ్యవంతుడు కాదు, ఏక్షణంలోనైనా వారిని దిక్కులేనివారిగా చేసిపోవచ్చు, వెనకా ముందూ ఆస్తులేం లేవు, మగపిల్లలు వున్నా, సావిత్రీ అందరిలోకీ పెద్దది. అందుకే సావిత్రి జీవితాన్ని గురించి రంగురంగుల కలలు కనదు.

ప్రభావతి స్నేహితురాలిచేతిని నొక్కింది, మెల్లగా తలెత్తి సావిత్రి అతిమృదువుగా నవ్విందా స్పర్శకు.




"బాధపడకు సావిత్రీ! ధైర్యంగావుండు...ఊ...ఊ...బేలతనం వదిలి మృదు హీలను ఒలికించు భామా!" అంది విజయ, అంతా ఫకాలుమన్నారు, తాత్కాలికంగా ఏర్పడిన గంభీర వాతావరణం ఒక్క క్షణంలో మారిపోయింది, దాంతోబాటు పైన వాతావరణంకూడ మారిపోయింది, ఆకాశమంతా మబ్బుపట్టింది, మేఘబాలికలు పరుగుపందెం వేస్తూంటే, వెనక నుండి తరుముకొస్తున్నట్టుగా పవన కాలురు వెంటబెడ్తున్నారు.

నలుగురూ తొందరగా లేచారు, అదే ఆఖరు కలయిక అన్నట్టుగా వున్నాయి ముఖాలు, ఉత్తరాలు రాయాలని ఒకరికొకరు చెప్పుకుంటూ నడుస్తున్నారు, విజయ చటుక్కున ప్రభావతిమీదకి వాలింది.

"ఈదురుగాలికదూ! కళ్ళు కనిపించివుండవ్!" అంది ప్రభావతి విజయని రాసుకుంటూపోయిన రోమియోనుద్దేశించి.

"నీకెంత ధైర్యం ప్రభా!" భారతి మెచ్చుకుంది.

గేటువైపు చూడమన్నట్లుగా ప్రభావతికి సైగ చేసింది సావిత్రి, తెల్లటి దుస్తులలో హుందాగా వున్నాడు త్రివేది, భారతి అధరాలు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

నలుగురూ అతడ్ని దాటిపోతూంటే పలకరించాడు, తిరిగి పలకరింపుగా నవ్వారు, భారతి కనుదోయి ఒకే ఒక్క క్షణం ఆ నయనాలతో కలిసి విడిపోయింది పదడుగులు వేశాడు.

"ఎప్పుడు?" అంది విజయ.

కిసుక్కుమంది ప్రభావతి.

ప్రభావతి చిటికెన వ్రేలిని గట్టిగా చిల్లింది భారతి.

భరతీ, ప్రభావతీ ఒకవైపు, సావిత్రీ, విజయా ఇంకొకవైపూ విడిపోయారు.

★ ★ ★

చదువుకునే రోజులలో భవిష్యత్తుమీద ఎన్నో ఆశలు పెంచుకోవడం సహజం, అదే అసంభవం అయినప్పుడా మనసులు ఎలా స్పందిస్తాయి! కలలు నిజమయ్యే అదృష్టం ఎంతమంది కుంటుంది? ఒకొక్కసారి తప్పు చేయకుండానే సంఘంలో దోషిగా ని

బడాల్సివస్తుంది. జీవితం పూలబాటగా, పన్నీటి వూటగావుంటుందని వూహించుకునేవారికి అది పల్లేరు కాయలబాటగా, ముళ్ళకంపలాగ ఎదురైనప్పుడు తట్టుకోగలరా! ఏది ఏదైనా కాలం ఆగదు, జీవితం సాగిపోతూనే వుంటుంది, జీవితాన్ని చక్కగా మలచుకోవడం మన చేతులలోనే వుందేమో!

కాలచక్రం వడివడిగా ముందుకిపోతూంది, అనుకోని మార్పులు జరిగిపోతున్నాయి.

భారతీ, సావిత్రీ, విజయ పాసయ్యారు. ప్రభావతి కెమిస్ట్రీలో తప్పింది, మళ్ళా పరీక్ష కట్టింది, స్నేహితురాళ్ళు నలుగురూ ఒకదగ్గర కలవడానికి వీలు పడలేదు, సావిత్రి తండ్రి పోయాడు, అయితే అదే ఆఫీసులో సావిత్రికి వుద్యోగం యిచ్చారు, పర్సంటేజి చాలనందున భారతి ఎమ్.ఎస్.సి. కి వెళ్ళలేదు, విజయ చదువుకూడ ఆగిపోయినట్టే.

ప్రభావతి పాసైంది, బి.యిడి. కి అప్లైచేసింది, భారతికూడ బి.యిడి. కి వెళ్తూంది.

ప్రభావతి, భారతి బి.యిడి. లో చేరారు, హాస్టలు జీవితం క్రొత్తగా, సరదాగావుంది, సావిత్రిదగ్గర్నుండి ఉత్తరాలు రావడం ఆగిపోయాయి. డిశంబరులో కాన్వొకేషన్ జరిగినప్పుడు మాత్రం విజయ కలిసింది, తన పెళ్ళి కుదిరిపోయినట్టుగా చెప్పింది, రోజులు గడచిపోతున్నాయి, ప్రభావతి, భారతీ బి.యిడి. పూర్తి చేసారు.

సాయంత్రం ఆరుగంటలైంది, సావిత్రిని హఠాత్తుగా చూసి ప్రభావతి ఒక్కక్షణం ఆశ్చర్యపోయింది, వెంటనే తేరుకుని స్నేహితురాల్ని వాటేసుకుంది.

"ఎక్కడున్నావే యిన్నాళ్ళూ? దొంగవి! ఉత్తరాలు రాస్తానన్నావూ?"

"నాది తప్పే! ఒప్పుకుంటున్నాగా! ఆ పరిస్థితులలో ఏదీ తోచలేదు ప్రభా! కోపం తెచ్చుకోకు! ప్లీస్!. ఇన్నాళ్ళకైనా నీకోసంవచ్చానా లేదా?"

ప్రభావతికి ఎందుకో చాల ఆనందంగా వుంది. పకపకా నవ్వింది.

"సావిత్రీ! నీ నాలుక పదునుదేరిందే! ఇంతకుముందెప్పుడైనా యిన్ని మాటలు మాట్లాడేవా?...ఊ! ఏమిటి విశేషాలు? త్వరగా చెప్పేయ్!"

కబుర్లలోపడ్డారు.

"భారతీ, త్రివేదుల పెళ్ళట?" సావిత్రి ఓరగా చూసింది.

"అవకపోతే విడ్డూరపడాలి, నీకెందుకా సందేహం?"

"వూరికే అడిగాను," నవ్వింది.

మళ్ళా తనే అడిగింది, "నీ పెళ్ళెప్పుడు?"

"ఏకాదశినాడు!" "అరె! ఎల్లుండే! దగ్గరపడిపోయిందే!" "మరేం!" నవ్వుకున్నారు. వెళ్తానంటూ లేచింది సావిత్రి.

★ ★ ★

మూడేళ్ళు వెనక్కి వెళ్ళాయి, ప్రభావతి పంతులమ్మగా పార్వతీపురంలో చేస్తుంది, భారతీ, త్రివేదుల పెళ్ళి యీమధ్యనే అయింది. ఒకే కులం, ప్రేమించుకున్నా, కట్నం కావాలన్నారు త్రివేది తల్లిదండ్రులు,

Regd. Trade Mark ఫోన్ : 22218 తంతి : "డౌటెక్స్"

DOVETEX TRADE MARK

# డౌటెక్స్ కంపెనీ

(ఉత్పత్తిదారులు, రవాణాదారులు)

బెడ్ షీట్స్-టవల్స్, దోవతులు, టర్కీ జక్కాడ్ టవల్సు మొదలైనవి, చేనేతబట్టలు మరియు నూలు వ్యాపారస్తులు.

No. 162919 & 258010 నెం. 14, మహాల్ 2 వ వీధి, మధురై - 625001.

ఈ సమస్యతో కొంతకాలం జాప్యంచేసారు, ఎలాగైతేనేం పెళ్ళి జరిగిపోయింది, త్రివేది హైదరాబాదులో వుద్యోగం చేస్తూండడంతో భారతికూడ వెళ్ళిపోయింది.

ప్రభావతి అక్కకి పెళ్ళి కుదిరింది, సెలవుపెట్టి వచ్చింది. మొదట్లో అక్కకి సంబంధాలు వెతికితే, చెల్లెల్ని చేసుకుంటామన్నారు, ససేమిరా వీల్లేదంది ప్రభావతి, ఇప్పటికి అక్కకి కుదిరింది, ప్రభావతికిప్పుడు పాతికేళ్ళు.

ఉదయం ఎనిమిదైంది, ఎండ కరకరమంటూంది, స్నానంచేసి వచ్చి జడ అల్లుకుంటూంది ప్రభావతి, రెండుచేతులు కళ్ళుమూశాయి, వులిక్కిపడింది తడిమింది, గాజుల శబ్దమే పోల్చులో లేకపోయింది, చేతులు పట్టుకుని వెనుదిరిగింది, ఒకర్నొకరు చూసుకుంటూ నిలబడిపోయారు.

మెడలో నల్లపూసలూ, పసుపువాడూ, ఒంటిపేట గొలుసు! చిక్కిపోయినట్టుగా గుర్తులు, కళ్ళక్రింద నల్లటీగీతలు—లోతుకుపోయిన కళ్ళు!

అప్పుడే తెలివివచ్చినట్టుగా కదిలి, స్నేహితురాలి చేతిని గట్టిగా నొక్కింది ప్రభావతి, తనకెంతో ప్రియమయిన ఆ స్పర్శతో సావిత్రి కిలకిలమంది.

"అన్యాయం సావిత్రీ! నన్నిక్కడ నిలబెట్టి, నువ్వేమో ఏదో పరవశత్వం వుండడం! నన్ను పరిచయం చేస్తావా?" పురుష కంఠం కంగుమంది గుమ్మం అవతలనుండి, ప్రభావతి చిన్నగా నవ్వుతూ "రండి లోపలికి! కూర్చోండి!" అని ఆహ్వానించింది, సావిత్రి ముసిముసి నవ్వులు కురిపిస్తుంది.

స్నేహితురాళ్ళ మాటలకి అంతులేకుండా వుంది. సావిత్రిచేసిన మూగ పరిచయానికి నవ్వుకుంటున్నాడతను, తనుకూడ వాళ్ళ కబుర్లతో కలిశాడు, వాళ్ళ మాటల ధోరణిబట్టి ప్రభావతికి అర్థమైంది విషయం, అతడు సావిత్రి భర్త, ట్రైనింగ్‌లో కలసినపుడు హృదయాలు యిచ్చి పుచ్చుకున్నారు, ఏవో ఆటంకలవలన పెళ్ళి వాయిదాపడింది, మూడు నెలలక్రిందటే జరిగింది



★

పి. యస్. ఆర్. పిక్చర్స్‌వారి

"సీతారామ వనవాసం"లో

కైకగా – విజయలలిత.

★

పెళ్ళి; చాలా కలుపుగోరు మనిషి అనుకుంది ప్రభావతి, ఇంట్లో వారిని పరిచయం చేసింది. సావిత్రి వెళ్ళిపోతూంటే జాకెట్టు గుడ్డా, పసుపు, కుంకం ఇచ్చింది ప్రభావతి తల్లి సావిత్రి కళ్ళు ఎందుకో తడి అయ్యాయి.

“నీ పెళ్ళెప్పుడు?” సావిత్రి అడిగింది.

ప్రభావతి పెదవులు బిగుసుకుపోయాయి. ఇంతలో అతడు పిలవడంతో సావిత్రి వెనుదిరిగింది.

వీరిద్దరిదీ కులాంతర వివాహం! ఈ సంసారం ఎలా వుంటుందో!

భారతీ, త్రివేదుల సంసారమేమంత సాఫీగా పోతున్నట్టు లేదు, ఏవేవో వార్తలు వస్తున్నాయి. భారతికి తెలియని జబ్బు త్రివేదికుంది, అదీ పెళ్ళయిన తర్వాతే తెలిసింది. అనుమానం జబ్బు! మనిషిని పిల్చి పిప్పిచేసే మానసిక వ్యాధి, ప్రతి విషయంలోనూ భారతిని అనుమానిస్తాడు, ఎక్కడికీ వెళ్ళనివ్వడు, జీవితమంతా బంగారు పంజమయిపోయింది భారతికి.

సావిత్రికి కూతురు పుట్టింది, ఎప్పుడైనా ప్రభావతి ఉత్తరం రాస్తుంటుంది, ప్రభావతికి మాత్రం పెళ్ళి కాలేదు. స్టాఫ్ రూములో కూర్చుని ప్రభావతి నోట్సులు దిద్దుకుంటూంది. “ప్రభావతిగారూ! మీ రెప్పుడిస్తారు శుభ లేఖ?” “ఆమధ్య ఇంటికి వెళ్ళొచ్చారూ— విశేషమా? అహా! అంత సడన్‌గా వెళ్ళారు కదా...” తెలుగు టీచరు పళ్ళన్నీ బయటపెట్టినవ్వింది.

ప్రభావతి, జవాబుగా తనూ నవ్వింది, పెదవి విప్పలేదు.

“మా బంధువులు—ఒకావిడ ఉందిలెండి. పోస్టు గ్రాడ్యుయేటు, లెక్చరరుగా పనిచేస్తుంది. ముప్పై ఆరేళ్ళు బాలాకుమారి! ఇంతవరకూ ముడిపడలేదు” గొంతు తగ్గించి “సంగతేమిటంటే—ఎవర్నో దృష్టిలో వుంచుకొనే పెళ్ళి చేసుకోలేదని పుకారు. నిక్షేపం లాంటి జీవితం! ఇలాంటి వెధవపనులెందుకు చేస్తుంటారో?” అంది తెలుగు టీచరు. ప్రక్కనే కూర్చుని వుత్సాహంతో వింటూన్న సైన్సు టీచరు ముసిముసి నవ్వులు ఒలికిస్తూ సైగ చేసింది. ఇద్దరూ గట్టిగా నవ్వుకుంటున్నారు,

ప్రభావతి ఒంట్లో రక్త ప్రసరణ ఆగిపోయినట్టుగా కూర్చుంది. లోపల సన్నగా ప్రారంభమైన బాధ అంతకంతకూ పెరిగిపోసాగింది. ఏదో కసి! ఎవరిమీదో తెలీదు. ఈ నిస్సహాయతకు బాధ్యులెవరు? పరోక్షంగా వీళ్ళు తననే అంటున్నారా? పెళ్ళి కాకపోవడం తన తప్పా? ఎవర్ని నిందించగలదు? తన ఖర్మ! అంతే!

ఎక్కడికి వెళ్ళినా ఇదే మాట. వేళాకోళంపట్టిస్తారు కొందరు. తనకిప్పుడు ముప్పై ఏళ్ళు! తల్లిదండ్రులు వూరికనే కూర్చోలేదే! శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఏదీ కుదరందే! వయసు సరిపోతే కట్నాల బాధ తప్పడం లేదు. ఏమార్గం తోచందే! పెళ్ళి కాకపోవడం అంత సహించరాని నేరమా? ఇలా నలుగుర్నీ ఆడిపోసుకునేవారిని నిలదీస్తే ఏమంటారు? మొన్నటికి మొన్న—పట్టు టీచరు తెలుగు టీచరుతో



అన్నమాటలు—తెలుగావిడ యిచ్చిన జవాబు తనింకా మరచిపోలేదు. తెలుగు టీచరు తమ్ముడికి తన కూతుర్ని అడిగారావిడ. "అబ్బే! మా తమ్ముడికింకా పాతికేళ్ళు నిండలేదు. మీ అమ్మాయి బాగా పెద్దదవుతుంది!" అని తీసిపారేయలేదూ! నిజానికి అతడికి ముప్పై దగ్గరే వుంటుంది వయసు. చెప్పేమాటలకీ, చేసే చేతలకీ ఎక్కడా పొత్తుకుదరదు.

ప్రభావతి మనసంతా జుగుప్సతో, అసహ్యంతో నిండిపోయింది. తన స్నేహితులు గుర్తుకొచ్చారు, భారతీ, త్రివేదులు విడిపోయారు, వీళ్ళది ప్రేమపెళ్ళి—ఒకే కులం! కాని భేదాభిప్రాయాలతో సంసారం నరకంచేసుకున్నారు. మరి సావిత్రి? వాళ్ళది కులాంతర వివాహం! అయినా ఎంత హాయిగా ఉంటున్నారు! వారం క్రితమే తెలిసింది—విజయ పెళ్ళై నాలుగేళ్ళయినా పిల్లలు పుట్టలేదని—అత్తగారు, దగ్గర బంధువులూ అతనికి రెండో పెళ్ళి చేస్తామంటున్నారు. కాని అతను ఎంత సహృదయుడో తెలుస్తుంది. విజయను అపురూపంగా చూసుకుంటాడట. రెండో పెళ్ళి వూసు ఎత్తవద్దన్నాడట. కాని దగ్గరవాళ్ళూ తల్లిదండ్రుల పోరూపడలేక యీరోజు కాకపోతే మరోనాడైనా లొంగిపోయే వాడేమో! నలుగురు స్నేహితులూ కలుసుకుని ఎన్నేళ్ళైంది—అందరిలోకీ సావిత్రీ సుఖంగా వుంది. ఒకర్నొకరు అర్థంచేసుకుని సంసార నౌకను సాఫీగా నెట్టుకొస్తున్నారు, మరి తనమాటేమిటి?

ప్రభావతి రెండు రోజులు సెలవుపెట్టి శ్రీకాకుళం వచ్చింది. సావిత్రి కలిసింది. తను చాలా సుఖంగా వున్నట్టుగా చెప్పింది. సావిత్రి వెళ్ళిం తర్వాత చాల సేపటివరకూ గదిలో కదలకుండా అలాగే కూర్చుంది ప్రభావతి. మరొక విషాద వార్త! విజయని భర్త పుట్టింటిలో దిగబెట్టేసాడట. సావిత్రీ చెప్పింది. వెళ్తూవెళ్తూ "నీ పెళ్ళెప్పుడు?" అని అడిగింది మళ్ళా.

తనకి పెళ్ళెప్పుడు? పెళ్ళి! పెళ్ళి! పాపం! ఎప్పటికైనా తన పెళ్ళవుతుందని అనుకుంటున్నారంతా! ఎలాగవుతుంది? పకపకమని నవ్వింది ప్రభావతి. తల్లి గదిలోకి వచ్చి కూతురి నవ్వుకి కారణం తెలీక నిలబడిపోయింది. ఇంకా నవ్వుతూనేవుంది. ఆవిడకి ఏదో భయం ఆవరించింది. తండ్రికూడ వచ్చాడక్కడికి.

"ప్రభా! ఏమిటానవ్వు?"

ప్రభావతి విరగబడి నవ్వుతూంది. మనసు ఘోషిస్తుంది. భారతి, త్రివేదులు విడిపోయారు! సావిత్రి హాయిగా వుంది! విజయని పుట్టింటికి దిగబెట్టేశాడు భర్త! తను? తన సంగతేమిటి? తనకి పెళ్ళవుతుందా? ప్చ్! ఇంకా పెళ్ళేమిటి? ఏయ్! ప్రభా! నీ పెళ్ళెప్పుడు? నీ పెళ్ళెప్పుడు ప్రభావతీ? ప్రభావతిగారూ! శుభలేఖ ఎప్పుడిస్తారు? పరిసరాలలో వున్న ప్రతి వస్తువు, ప్రతీ ప్రాణీ ప్రభావతిని ప్రశ్నిస్తున్నాయి! "నీ పెళ్ళెప్పుడు?" అని

చక్కని అల్లిక - చిరకాల మన్నిక




వీనస్ నిట్టింగ్ కంపెని

తిరుపూరు — 638604.